సాక్షి
నిర్మల్
శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



కాలికోం వాయిస్తున్న మెస్రం వంశీయుడు

మహాపూజకు బయలుదేరిన మెస్రం వంశీయులు



నమో నాగోబా

- మెస్రం వంశీయుల మహా పూజతో జాతర షురూ
- సంప్రదాయబద్ధంగా ఆదివాసీల పూజలు
- హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు

నాగోబా.. ఆదివాసీల ఆరాధ్య దైవం. పుష్యమాస అమావాస్య పురస్కరించుకుని కేస్లాపూర్‌లోని ఆలయం శుక్రవారం భక్తజనంతో పులకించింది. రోజంతా మెస్రం వంశీయుల సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఉదయం ప్రత్యేక వాయిద్యాల నడుమ.. తెల్లని వస్త్రాలతో తరలివచ్చారు. ఆనవాయితీగా వచ్చే ఎర్రటి కుండల్లో నీటిని తీసుకువచ్చి ఆడపడుచులు కొత్త పుట్టను తయారు చేశారు. రాత్రి ఆలయాన్ని శుద్ధి చేసి పవిత్ర గంగాజలంతో నాగోబాను అభిషేకించారు. మహాపూజ అనంతరం జాతర షురూ అయింది.

– ఇంద్రవెల్లి



విద్యుత్ వెలుగుల్లో నాగోబా ఆలయం



నాగోబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం తదితరులు



డోలు కొడుతున్న చిన్నారులు

కేస్లాపూర్‌లో గత నెల 21న గంగాజల సేకరణ కోసం మొదలైన మెస్రం వంశీయుల పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఉదయం గ్రామంలోని మురాడి నుంచి నాగోబా విగ్రహం, పూజ సామగ్రిని ఆలయానికి చేర్చారు. మర్రిచెట్టు వద్ద బస చేసిన వంశీయులు పవిత్ర గంగాజలంను సంప్రదాయ వాయిద్యాలైన డోలు, తుడుం, కాలికోమ్, పెప్రే వాయిస్తూ శోభాయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. మైసమ్మ దేవతకు పూజలు చేసి లోనికి ప్రవేశించారు. నాగోబాను దర్శించుకుని పూజలు చేశారు. 22 కితలకు చెందిన మహిళలు, ఆడపడుచులు వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుని వారి నుంచి కొత్త కుండలు అందుకున్నారు. వంశ అల్లుళ్లతో కలిసి వారు మర్రి చెట్టు వద్ద ఉన్న కోనేరు నుంచి పవిత్ర జలం సేకరించి ఆలయానికి తీసుకొచ్చారు. ప్రధాన్ కిత సంప్రదాయ వాయిద్యాల మధ్య ఆలయం పక్కనే గల పాత పుట్టలను అల్లుళ్లు తవ్వారు. ఆ మట్టితో ఆడ పడుచులు తిరిగి కొత్త పుట్టలు తయారు చేశారు. వాటిని తీసుకొని సతీ దేవత ఆలయం ముందు ఏడు వరుసలతో బౌల దేవతను తయారు చేసి మొక్కుకున్నారు. ఈ పూజలు సాయంత్రం వరకు కొనసాగాయి.

గంగాజలంతో అభిషేకం..

పవిత్ర గంగాజలంతో రాత్రి 9 నుంచి 11 గంటల వరకు ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం నాగోబాను అభిషేకించి మహాపూజ చేపట్టారు. (ఈ సమయంలో మెస్రం వంశీయులు ఇతరులను అనుమతించరు.) అనంతరం వచ్చిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు మెస్రం వంశీయులతో కలిసి ప్రత్యేక పూజలు చేపట్టి జాతరను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి మెస్రం వంశీయులు, భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ పరిసర ప్రాంతం జనసంద్రంగా మారింది. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి శనివారం తెల్లవారుజాము 3 గంటల వరకు బేటింగ్ (పరిచయ పూజ) నిర్వహించారు. ఇప్పటి వరకు నాగోబా సన్నిధికి రాని సుమారు వందకు పైగా మెస్రం వంశ కొత్త కోడళ్లు తెల్లటి దుస్తులు ధరించి ఇందులో పాల్గొన్నారు. వంశ మహిళల సహకారంతో ముందుగా వారితో సతీదేవత, నాగోబా ఆలయాల్లో పూజలు చేయించి దేవతలను చూపెట్టారు. అనంతరం వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ తంతుతో వారు పూర్తిగా మెస్రం వంశంలో చేరినట్టుగా భావిస్తారు. కార్యక్రమంలో మెస్రం వంశం పటేల్ వెంకట్‌రావ్, కటోడ కోసు, వంశ పెద్దలు కోసేరావ్, బాదిరావ్, లింబారావ్, దాదారావ్, కోత్వల్ తిరుపతి, వంశ ఉద్యోగులు మనోహర్, దేవ్‌రావ్, సోనేరావ్, శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గంగా జలంతో ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు



ఏడు వరుసల బౌల దేవతను తయారు చేసి మొక్కుతున్న మహిళలు



కోనేరు వద్ద పవిత్ర జలాన్ని కుండలలో నింపుతూ..

ఫొటోలు.. : సాక్షి, ఫొటోగ్రాఫర్



పుట్ట తయారీ కోసం ఆవు పేడను తీసుకొస్తున్న మెస్రం ఆడపడుచులు



వంశ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న ఆడపడుచులు



మహాపూజకు హాజరైన మెస్రం వంశీయులు

న్యూస్‌రీల్

మామడ ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ



పరిసరాలు పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల

మామడ: మామడ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది విధులు, అధికారుల పనితీరును, కేసుల వివరాలు తెలుసుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సూచనలు చేశారు.

రేపు గురుకుల ప్రవేశ పరీక్ష

భైంసాటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు భైంసా పాఠశాల ప్రిన్సిపాల్ బి.సుమలత తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని పరీక్ష కేంద్రంలో ఆదివారం ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్,వాటర్ బాటిల్, బ్లాక్‌పెన్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌లో వివరాలు తప్పుగా ఉంటే సంబంధించిన ఆధారాలతో హాజరు కావాలని తెలిపారు. సందేహాలకు 7995010575, 9642200405 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కుంటాల: రైతులు అధిక ఎరువులు వాడితే అనర్థమేనని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ సూచించారు. కుంటాల మండలం కల్లూర్ రైతువేదికలో ఎరువుల వాడకంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. మొక్కజొన్నకు రెండు దఫాలుగా నాలుగేసి బ్యాగులు మాత్రమే వేయాలన్నారు. రైతులు 10 బ్యాగులు వేయడంతో దిగుబడిపై ప్రభావం చూపుతోందని తెలిపారు. దీని ప్రభావం ఖరీఫ్ పంటలపైనా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో సోమలింగారెడ్డి, ఏఈవోలు గణేశ్, శ్రీధర్, మహేశ్, ప్రగతి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 7వ తేదీన జిల్లాకేంద్రంలో నిర్వహించిన సబ్ జూనియర్‌స్థాయి క్రీడాపోటీలలో స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు చెందిన పి.శివ(400 మీటర్ల పరుగుపందెం), రేవంత్(లాంగ్ జంప్), కృతిక్(షార్ట్‌పుట్), సాయి దీక్షిత్‌గౌడ్(600 మీటర్ల పరుగుపందెం) రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నందకుమార్ వివరించారు. వీరు ఈనెల 10, 11 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్ల ధర్నా



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

నిర్మల్: తమకు ఇచ్చిన హామీలు అమలు చేయడంతోపాటు, తమ డిమాండ్లు నెరవేర్చాలని కలెక్టరేట్ ఎదుట ఆశ వర్కర్లు శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆందోళన చేశారు. రెండు నెలలుగా వేతనాలు రావడం లేదన్నారు. తమను కనీసం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విధులు మినహా ఇతర విధులు కేటాయించొద్దని కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోకి చొచ్చుకువెళ్తున్న ఆశ కార్యకర్తలు, సీఐ టీయూ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. పలువురు గాయపడ్డారు. పురుష పోలీసులు ఆశ కార్యకర్తలపై వ్యవహరించిన తీరును సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఖండించారు. పోలీసులపై చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ డిమాండ్ చేశారు.

చదువులమ్మ చలువతో..

- బాసరలోనే భారతరత్న 'పీవీ' అక్షరాభ్యాసం
- మాజీప్రధానికి మన సరస్వతమ్మ ఆశీస్సులు
- 1995లో ప్రధాని హోదాలో జిల్లాకు..
- బాసరలో అమ్మవారి దర్శనం, నిర్మల్‌లో సభ
- పార్లమెంటులో పీవీ సర్కారుకు మద్దతిచ్చిన 'అల్లోల'
- తాజాగా అత్యున్నత పౌర పురస్కారంపై జిల్లా హర్షం

నిర్మల్: బహుభాషా కోవిదుడిగా, మహామేధావిగా, అపరచాణక్యుడిగా, ఆధునిక సంస్కరణలకు ఆద్యుడిగా, అభివృద్ధి ప్రదాతగా.. మన దేశ ప్రధానమంత్రిగా ఎంతో పేరుప్రఖ్యాతలు పొందిన పీవీ.నర్సింహారావు తొలి అక్షర శ్రీకారం చేసింది మనదగ్గరే. జిల్లాలో కొలువుదీరిన బాసర సరస్వతమ్మ ఒడిలోనే చిన్నప్పుడు ఆయన అక్షరాభ్యాసం చేశారు. 1995లో ప్రధాని హోదాలో పీవీ నిర్మల్‌కు వచ్చారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్రమోదీ మాజీ ప్రధాని పీవీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రకటించడంతో జిల్లా హర్షం వ్యక్తంచేస్తోంది. పీవీ జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది.

బాసరలోనే అక్షరశ్రీకారం..

పీవీ.నర్సింహారావు చిన్నతనంలో బాసరకు వచ్చిన ఆయన కుటుంబం పీవీతో ఇక్కడ అక్షరశ్రీకారం చేసినట్లు 1995లో బాసర వచ్చినప్పుడు పీవీ గుర్తుచేసుకున్నారు. తనపై జ్ఞానసరస్వతీమాత అనుగ్రహం ఉందని తెలిపారు. ఆ సమయంలో ఆలయం గర్భగుడి పక్కనే పీవీ నర్సింహారావు కదంబ వృక్షాన్ని నాటారు. ఇప్పటికీ ఆ చెట్టు అక్కడ ఆయన గుర్తుగా ఉంది. ప్రధానమంత్రి హోదాలో పీవీ వచ్చివెళ్లిన తర్వాతే బాసర ఆలయ అభివృద్ధి ప్రారంభమైంది.

నిర్మల్‌లో భారీ సభ..

ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1995లో పీవీ.నర్సింహారావు జిల్లాకు వచ్చారు. ముందుగా బాసరలో జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. పక్కనే ఉన్న నిజామాబాద్ జిల్లా బుస్సాపూర్ వద్ద ఎస్సారెస్పీ వరద కాలువకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్‌లోని ప్రస్తుత శాంతినగర్‌లోని రాజీవ్‌గాంధీ ఐటీఐ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు నిజామాబాద్, కరీంనగర్, మహారాష్ట్ర నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఇందిరా, రాజీవ్‌గాంధీ తర్వాత నిర్మల్ ప్రాంతానికి ఓ ప్రధానిగా పీవీనే వచ్చారు.



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు రామారావుపటేల్, పాయల్ శంకర్, హరీశ్‌బాబు

పీవీకి భారతరత్న గర్వకారణం

భైంసాటౌన్: మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావుకు కేంద్రం దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం గర్వకారణమని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. సహచర ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం అసెంబ్లీలోని పీవీ.చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

అందుకే పీవీకి అండగా నిలిచా..



పీవీ నర్సింహారావుకు కేంద్రం దేశ అత్యున్నత పురస్కారం ఇవ్వడం చాలా సంతోషకరమైన విషయం. ఆ మహనీయుడికి సరైన గుర్తింపు ఇచ్చినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. 1991లో నేను ఎంపీగా ఉన్నప్పుడు పీవీ ప్రధాని అయ్యారు. తన ప్రభుత్వం మైనార్టీలో పడినప్పుడు ఓ తెలంగాణ బిడ్డ ప్రధానిగా ఉండే అవకాశాన్ని కోల్పోవద్దని నేను మద్దతిచ్చాను. పీవీ.నర్సింహారావు జ్ఞాపకంగా నిర్మల్ శాంతినగర్‌చౌరస్తాలో ఆయన విగ్రహాన్ని పెట్టించా.

– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీమంత్రి

పీవీకే మద్దతిచ్చిన అల్లోల..

రాజీవ్‌గాంధీ హత్యానంతరం కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన పీవీ.నర్సింహారావు 1991లో ప్రధానమంత్రి అయ్యారు. అప్పట్లో ఆయన ప్రభుత్వం మైనార్టీలో పడింది. ఆ సందర్భంలో పీవీ పలు పార్టీల మద్దతు కోరారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ఆయనకు అండగా నిలిచారు. ఇందులో టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా గెలిచిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కూడా ఉన్నారు. తెలుగుదేశం నుంచి గెలిచినప్పటికీ తెలంగాణ బిడ్డ ప్రధాన మంత్రిగా ఉండాలన్న లక్ష్యంతోనే ఆయన పీవీకి అండగా నిలిచారు. జిల్లా నుంచి రాజకీయాల్లో తనదైన ముద్రవేసిన ముథోల్ దివంగత ఎమ్మెల్యే గడ్డెన్నకూ పీవీ.నర్సింహారావుతో సత్సంబంధాలు ఉండేవి.

ఆ మాట ఇప్పటికీ గుర్తుంది..



మాజీ ప్రధానమంత్రి పీవీ.నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వడం హర్షనీయం. ఇన్నేళ్లకైనా తెలంగాణ బిడ్డకు తగిన గుర్తింపుదక్కింది. పేదప్రజల గురించి ఆలోచించే పీవీ వంటి నేతలు చాలా అరుదుగా ఉంటారు. 'అభివృద్ధి అంటే.. ఏదో కాదు. సామాన్యుడి సాధారణ అవసరాలు తీర్చడం..' అని 1995లో నిర్మల్‌సభలో పీవీ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తుంది.

– కట్టు నాగాచారి, విశ్రాంత జర్నలిస్టు, నిర్మల్

తెలంగాణకు గర్వకారణం..



తెలంగాణలో పుట్టి దేశ ప్రధానమంత్రిగా ఎదిగిన పీవీకి భారతరత్న ఇవ్వడం మన రాష్ట్రానికే గర్వకారణం. తన సంస్కరణలతో పీవీ దేశాన్ని పునర్నిర్మించారు. అలాంటి మహనీయుడికి భారతరత్న దక్కినందుకు పెన్షనర్ల సంఘం తరఫున కేంద్రానికి కృతజ్ఞతలు.

– ఎంసీ.లింగన్న, పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి

పీవీకి తగిన గుర్తింపు..



ప్రధానమంత్రిగా దేశాన్ని అభివృద్ధి పథంవైపు నడిపిన మహా మేధావి పీవీ.నర్సింహారావు. దేశానికి తను చేసిన సేవలకు ఇన్నాళ్లకు సరైన గుర్తింపు దక్కింది. పీవీకి భారతరత్న ఇచ్చిన కేంద్రప్రభుత్వానికి కృతజ్ఞతలు. బ్రాహ్మణ సంఘం చేసిన కృషితోనే నిర్మల్‌లో పీవీ విగ్రహం ఏర్పాటైంది.

– కిశోర్ కాట్లేకర్, బ్రాహ్మణసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఈవీఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలన చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌ఖిల్లా: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం యంత్రాలు మొదటి స్థాయి పరిశీలన(ఎఫ్ ఎల్‌సీ)ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రక్రియను సీసీ కెమెరాల్లో నిక్షిప్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎం గోదాం వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఎన్నికల సూపరిటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌ఖిల్లా: బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల ఎంపికకు జిల్లాలోని ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంలో రెసిడెన్షియల్ విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి రెండు జతల దుస్తులు పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలకు ప్రతీ విద్యార్థికి రూ.42 వేలు చెల్లిస్తుందని తెలిపారు. డేస్కాలర్ విద్యార్థికి రూ.28 వేలు చెల్లిస్తుందన్నారు. దరఖాస్తుల కోసం జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈనెల 20 తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వివరాలకు 8309835938 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

గ్యాస్ ఏజెన్సీలో చోరీ



గ్యాస్ కట్టర్‌తో రంధ్రం చేసిన ఇనుప కిటికీ

ముధోల్: మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భారత్ గ్యాస్ ఏజెన్సీలో గుర్తుతెలియని దుండగులు వెనుక భాగంలో ఉన్న ఇనుప కిటికీని గ్యాస్‌కట్టర్‌తో తొలగించి లోపలకు చొరబడ్డారు. రూ.15 వేల నగదుతోపాటు సీసీ కెమెరాల డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ మల్లేశ్, ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

నేరడిగొండ: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నేరడిగొండ కేజీబీవీ విద్యార్థినులు ఎంపికైనట్లు జిల్లా సెక్రెటరీ గంగాధర్ తెలిపారు. శుక్రవారం వీరిని పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లాలో తుప్రాన్‌లో ఈనెల 3,4వ తేదీల్లో నిర్వహించిన 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటారన్నారు. జిల్లా తరఫున పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన బి.వనిత, డి.శిరీష, ఎం.అలేఖ్యలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. బిహార్ రాష్ట్రం పాట్నాలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని వివరించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి రజిత, వ్యాయామ ఉపాధ్యాయులు స్నేహ, కోచ్ రవి, వీడీసీ చైర్మన్ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



స్వర్ణపతకం సాధించిన యోగేశ్

భైంసాటౌన్: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో ప్రతిభచాటి జాతీయస్థాయికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జబ్బార్ తెలిపారు. తెలంగాణ అమెచర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హన్మకొండలో జరిగిన అండర్–15, అండర్–20 రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాఠశాలకు చెందిన యోగేశ్ స్వర్ణ పతకం, కళాశాలకు చెందిన సమీర్ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, పీఈటీ రాజును పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

నాగోబా సందడి

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతర శుక్రవారం రాత్రి నిర్వహించిన మహాపూజతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు సంప్రదాయ పూజలు చేశారు. ప్రధాన్ కిత తెగకు చెందిన చిన్నారులు ఆదివాసీ సంప్రదాయ మంగళవాయిద్యాలు, డోలు వాయించి ఆకట్టుకున్నారు.

– ఇంద్రవెల్లి/సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



మురాడి నుంచి పూజాసామగ్రి, నాగోబా ప్రతిమను ఆలయానికి తీసుకువస్తున్న మెస్రం వంశీయులు



కుండ అందుకుంటున్న మహిళలు



కొత్త పుట్టకు పూజలు చేస్తున్న వంశ మహిళలు



మైసమ్మ దేవతకు మొక్కుతున్న వంశీయులు



గంగాజలాన్ని ఆలయ ప్రదేశంలో కడుతూ..



తలపాగా చుడుతూ..



సంప్రదాయ వాయిద్యాలతో చిన్నారులు

ఎండీఎం బియ్యంపై విచారణ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బాలక్‌మందిర్ పాఠశాలలో గతనెల 9న మధ్యాహ్న భోజనం కోసం నిల్వఉంచిన బియ్యాన్ని అక్రమంగా ఆటోలో తరలించారని కలెక్టర్, డీఈవోకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం డీఈవో ప్రణీత పాఠశాలలో విచారణ జరిపించాలని ఆదేశాలు జారీచేశారు. విచారణ అధికారిగా ఆదిలాబాద్ ఎంఈవో జయశీలను నియమించారు. అయితే గత నెల 9న రాత్రివేళలో పాఠశాలలో పనిచేసే అటెండర్ తనకు ఉన్న ఆటోలో బియ్యాన్ని మూడుసార్లు తరలించారని పేర్కొన్నారు. ఆయనతోపాటు స్థానిక రేషన్‌డీలర్ ఉన్నారని తెలిపారు. స్థానికులు ఆటోను అడ్డుకోగా ఆయన కాళ్లు పట్టుకున్నారని, హెచ్‌ఎం ఆదేశాలతోనే తాము బియ్యం తరలించినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై గతనెల 27న కలెక్టర్, డీఎస్‌ఓ, డీఈఓ, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ విచారణ జరిపించనున్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన పత్రం

నాగోబా జాతరకు ఏర్పాట్లు పూర్తి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



సీసీ ఫుటేజీలో రికార్డు అయిన జాతర పరిసరాలు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహా పూజకు వచ్చే మెస్రం వంశీయులు, భక్తుల కోసం ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ తెలిపారు. ఇందులో 600 మంది పోలీసులు, 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జాతర పరిసర ప్రాంతాలు పరిశీలిస్తున్నారు. అదేవిధంగా స్టాళ్ల వద్ద ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు దరఖాస్తులను పీటీడీఏ అధికారులు స్వీకరించారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు

- రూ.6.20 లక్షల గంజాయి స్వాధీనం
- వెల్లడించిన ఎస్పీ జానకి షర్మిల



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్ ఎక్స్ రోడ్ వద్ద గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రానికి రెండు స్కోడా కార్లు, ఒక బొలెరో వాహనాల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో కొండాపూర్ జంక్షన్ వద్ద మాటువేసి పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేయగా 24.8 కిలోల గంజాయి లభ్యమైంది. వీటి విలువ రూ.6.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న మెగావత్ రాజు, షేక్ ఇమ్రాన్, షేర్ షాదిక్ షేక్, మహమ్మద్ ఇలియాస్, ప్రఫూర్ కుమార్ ఖిల్లా, బావులాల్ దేవ్, పందేనా నిఖిల్‌ను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.40 వేల నగదు, 10 సెల్‌ఫోన్లు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ఒడిశా రాష్ట్రంలోని మల్కానిగిరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వద్ద కిలో రూ.3 వేల చొప్పున మొత్తం 50 కిలోలు కొని ఏడుగురు కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వివిధ ప్రాంతాల వద్ద వీటిని అమ్మడానికి పథకం పన్నారు. వారు ప్రయాణించే వాహనాల్లో ప్రత్యేకంగా గంజాయిని దాచడానికి స్పెషల్ కంపార్ట్‌మెంట్ తయారు చేసినట్లు గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రిమాండ్ విధించారు. ముఠా పట్టుకోవడానికి సహకరించిన డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు చంద్రమోహన్, యాసిద్ అరాఫత్ అలీ, కృష్ణసాగర్‌రెడ్డి, రవీందర్, రవికుమార్, సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

పీఆర్టీయూ బలోపేతానికి కృషి

- జిల్లా అధ్యక్షుడు టి.నరేంద్రబాబు



జెండా ఎగురవేసిన పీఆర్టీయూ నాయకులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధ్యాయుల సంక్షేమానికి పాటుపడుతున్న పీఆర్టీయూ బలోపేతానికి ప్రతీ సభ్యుడు కృషి చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు కోరారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘం ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. సంఘం పతాకాన్ని అధ్యక్షుడు ఆవిష్కరించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నరేంద్రబాబు మాట్లాడుతూ.. 1971లో పీఆర్టీయూ ఏర్పడిన నాటి నుంచి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తూ 75 వేల మంది సభ్యత్వంతో అతిపెద్ద సంఘంగా ఆవిర్భవించిందన్నారు. ఉపాధ్యాయులకు ఏ చిన్న సమస్య తలెత్తినా పరిష్కారానికి యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, సీపీఎస్ విధానం రద్దు, నూతన పీఆర్సీ అమలుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గసభ్యులు రమేశ్‌రెడ్డి, బి.శ్రీను, మోహన్, సిద్ధిరాం, అశోక్, యు.రవి, సంజీవరావు, సాయిప్రసాద్, శ్రీనివాస్, కేపీ.రెడ్డి, లింగన్న, హరిప్రసాద్, భూమారెడ్డి, పరమేశ్వర్, దేవిప్రియ, రాజశేఖర్‌రెడ్డి, రాఘవేందర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో నిధులు పెంచాలి

తానూరు: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10న అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కొఠారీ మిషన్ చెబుతున్నా ప్రభుత్వాలు ఆ మేరకు నిధులు కేటాయించలేదని తెలిపారు. ఈ బడ్జెట్‌లోనైనా 20 శాతం నిధులు కేటాయించాలని కోరారు.

నారాయణరావుపటేల్‌ను కలిసిన రేఖానాయక్

భైంసాటౌన్: ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు భోస్లే నారాయణరావుపటేల్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో కలిసిన ఆమె రానున్న ఎంపీ ఎన్నికలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై మాట్లాడారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో తనకు మద్దతు తెలపాలని కోరారు. పార్టీ అభ్యర్థిగా ఎవరిని ఖరారు చేసినా తన మద్దతు ఉంటుందని నారాయణరావుపటేల్ తెలిపినట్లు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



గేడం గణపతి (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: బైక్ ఢీకొని ఒకరు మృతి చెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. మండలంలోని శ్యాంపూర్ గ్రామానికి చెందిన గేడం గణపతి (55) గురువారం రాత్రి మెడికల్ షాపులో మందులు తీసుకున్నాడు. తిరిగి ఇంటికి కాలినడకన వెళ్తున్నాడు. గంగన్నపేట్ గ్రామానికి చెందిన నాథరి ప్రశాంత్ ఉట్నూర్ వైపు బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన గణపతిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. రాత్రి అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య గేడం సీతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బోథ్: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన ఉమర్ (52) బోథ్‌లోని సాయినగర్‌లో పరుపులు తయారు చేసే దుకాణంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం మోటారు వద్ద విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. పక్కనే ఉన్న సామగ్రికి మంటలు అంటుకుని వ్యాపించాయి. దీంతో ఉమర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మంటలను గమనించిన స్థానికులు విద్యుత్ సరఫరాను ఆపివేశారు. సీఐ భూమేష్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని గోపాల్‌నగర్‌లో భోస్లే కాంతాబాయి(53) శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం.. కాంతాబాయి కుమారులు ఇద్దరు ఉపాధి నిమిత్తం ఉట్నూర్‌కు వెళ్లగా, కోడళ్లతో కలిసి గోపాల్‌నగర్‌లోని ఇంట్లో నివాసముంటోంది. ఈ క్రమంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అటవీప్రాంతాల సందర్శన



ఎన్‌టీసీఏ టీంతో అటవీ అధికారులు

కడెం: మండలంలోని ఉడుంపూర్ అటవీరేంజ్ పరిధిలో శుక్రవారం ఎన్‌టీసీఏ ఇన్‌స్పెక్షన్ టీం ఉన్నతాధికారులు అలోక్‌కుమార్ (చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ మధ్యప్రదేశ్), యోగేశ్ (చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ అరుణాచల్‌ప్రదేశ్)లు పర్యటించారు. గండిగోపాల్‌పూర్ బేస్ క్యాంప్, కల్పకుంట వాచ్‌టవర్, బర్డ్ వాచింగ్, ఐలవ్ కవ్వాల్ లోగోను సందర్శించారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ కోసం చేపట్టిన పనులు, గడ్డి క్షేత్రాలను పరిశీలించారు. డీఎఫ్‌వో రాంకిషన్, ఎఫ్‌డీవో భవాని శంకర్, ఎఫ్ఆర్వో శంకర్, డీఆర్వో ప్రకాశ్, హైటికోస్ ప్రతినిధి వెంకట్, తదితరులు ఉన్నారు.

అక్రమాలపై విచారణ

ముధోల్: ముధోల్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో 2016–17 సంవత్సరంలో జరిగిన అక్రమాలపై ఆర్జేడి మోతి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇక్కడ పని చేసిన సీడీపీవో సుగుణపై 200 బియ్యం బ్యాగుల అవకతవకలపై విచారణకు వచ్చినట్లు తెలిపారు. ఇదివరకు మూడుసార్లు విచారణ జరిగిందని వివరించారు. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించామని, వివరాలను సంబంధిత కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

ఔషధ మొక్కలతో విస్తృత ప్రయోజనాలు

భైంసాటౌన్: ఔషధ మొక్కలతో విస్తృత ఉపయోగాలు ఉన్నాయని ప్రముఖ ఆయుర్వేద, హెర్బలిస్ట్ డాక్టర్ ఉమేశ్‌గుప్తా అన్నారు. పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఔషధ మొక్కలు, వాటి ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. క్షారజలం ప్రాధాన్యత, తయారీ విధానాన్ని వివరించారు. శరీరంలో ఆమ్లతత్వం తగ్గించాలంటే క్షారజలం తీసుకోవాలన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్, వృక్షశాస్త్ర విభాగ అధిపతి వి.మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాలదహీ హండి



మహాదేవ్ ఆలయంపై కాలదహీ హండి పూజలు

బేల: మండలంలోని సదల్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారు అటవీప్రాంతంలోని భైరందేవ్, మహాదేవ్ ఆలయాల వద్ద జంగీ జాతర ముగింపు సందర్భంగా కాలదహీ హండి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రెండు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు శోభాయాత్ర ర్యాలీ చేపట్టారు. తర్వాత మహాదేవ్ ఆలయం పైభాగంలో పూజలు చేసి, ఆలయ శిఖరంపై నూతన జెండా ఎక్కించారు. కాలదహీ హండికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హండిని పగులగొట్టారు. పూర్వీకుల సంప్రదాయ ప్రకారం సభ్యులు ఆలయం పైనుంచి కిందకు భక్తులకు ప్రసాదాన్ని విసిరారు. తర్వాత అన్నదానం చేపట్టారు. ఆలయకమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావు, కార్యదర్శి పెందుర్ రాందాస్, భీంరావు, పూజార్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆదేశిస్తే ఎంపీగా పోటీచేస్తా

- ఆదివాసీ ఉద్యమనేత కోవ దౌలత్‌రావు మోకాశి



గిరిజనులతో దౌలత్‌రావు మోకాశి

నార్నూర్: కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశిస్తే ఎంపీగా పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని ఆదివాసీ ఉద్యమనేత కోవ దౌలత్‌రావు మోకాశి అన్నారు. గాదిగూడ మండలంలోని కుండి, కోలాంగూడ, పిప్రి, కుండి శేకుగూడ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలకు రోడ్డు రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. చిన్నపాటి వర్షం వస్తే నాలుగు గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి ఉందన్నారు. ఆయన వెంట ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కోట్ల లింబారావ్, మాజీ సర్పంచులు డిగాంబర్, బాజీరావు, ఆత్రం రాజు పటేల్, ఆదివాసీ సేన కుమురం జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి, కేడీఆర్ సైన్యం సభ్యులు మడవి వెంకట్రావు, సోయం గుణవంతు, చిత్రు, కోట్నాక్ జంగు, ఛత్రుఘన్ తదితరులు ఉన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సెగ్రిగేషన్ షెడ్ పరిశీలిస్తున్న ఫైజార్ హైమద్

లోకేశ్వరం: గ్రామా పంచాయతీల్లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అదనపు కలెక్టరు ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని ధర్మోరలో పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధాం పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాతీయలో రికార్డులు తనిఖీ చేశారు. పల్లె ప్రకృతి వనంలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు మొలకెత్తేలా చూడాలన్నారు. ఇంటింటా తడిపొడి చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలి సూచించారు. సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నథ్ ఉన్నారు.

నైపుణ్య శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఖానాపూర్: ఎస్సీ, ఎస్టీ, నిరుద్యోగ యువతతోపాటు విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో అందించే ఉచిత నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రాములు, ఏపీపీసీ కోఆర్డినేటర్ సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు హాజరై మాట్లాడారు. యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ నిర్వాహకులు ఎండీ.యాసిన్, లాండేరి రవి, లవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- నారీ శక్తివందన్ రాష్ట్ర కన్వీనర్ సుహాసినిరెడ్డి



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

నిర్మల్‌ఖిల్లా: మహిళా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నారీ శక్తివందన్ రాష్ట్ర కన్వీనర్ సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నారీశక్తివందన్ అభియాన్ వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ.. మహిళా సంఘాలకు రుణ సౌకర్యం, మహిళలకు ప్రత్యేక పథకాలు అమలు పరుస్తున్న తీరును క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలను బీజేపీకే మద్దతు పలికేలా చైతన్యవంతం చేయాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం ద్వారా చేతివృత్తి పనుల మహిళలను గుర్తించి వారికి ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, పార్లమెంటు కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్రనాయకుడు రావుల రాంనాథ్, ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, మహిళా మోర్చా నాయకులు రజిని వైద్య, సామ భూలక్ష్మి, కల్పన, అనన్య, అనసూయ, కమల, మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రజాదర్బార్‌లో వినతి



వినతిపత్రం ఇస్తున్న ఆర్పీలు

ఖానాపూర్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖానాపూర్ మెప్మాలో పనిచేసే ఆర్పీలు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాదర్బార్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేయడంతోపాటు వేతనాలు పెంచాలని విన్నవించారు. నిరుపేద కుటుబాలకు చెందిన తమకు ప్రస్తుతం ఇచ్చే రూ.4వేలతో ఇళ్లు గడవడం కూడా కష్టంగా మారిందని, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. ఆర్పీలు రాజు, రాజేందర్, లావణ్య, రామలక్ష్మి, నారాయణ, రమేశ్, సులోచన, రాజలింగం, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.